

ఘనంగా లక్ష ఫలార్చన

గాయత్రీ మాతకు లక్ష ఫలార్చన పూజ సోమవారం ఘనంగా నిర్వహించారు. పోచారం మున్సిపాలిటీ పరిధిలోని అన్నోజిగూడ గాయత్రీ దేవాలయం 19వ వార్షికోత్సవం సందర్భంగా మూడో రోజు ప్రత్యేక పూజలు నిర్వహించి, విశేష అలంకరణగావించారు. వసంత పంచమి సందర్భంగా అమ్మవారు సరస్వతీదేవిగా దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా పలువురు చిన్నారులకు అక్షరాభ్యాసం చేశారు.

- ఘట్‌కేసర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి)



ఆలయంలో పూజలు చేస్తున్న స్పీకర్ ప్రసాద్ కుమార్

ఆలయ వార్షికోత్సవంలో స్పీకర్ పూజలు

వికారాబాద్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): వెంకటాపూర్ తండాలో జరిగిన జగదాంబ భవానీ మాత, జగద్గురు సేవాలాల్ మహారాజ్ 18వ వార్షిక మహోత్సవం మూడు రోజులుగా కనుల పండువగా కొనసాగుతోంది. సోమవారం ఈ పూజ కార్యక్రమాల్లో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు, డీసీసీ డైరెక్టర్ కిషన్ నాయక్ ఆయనను ఘనంగా సన్మానించారు. అంతకుముందు అనంతగిరిపల్లి లక్ష్మీనారాయణ స్వామిఆలయ ముఖ ద్వారాన్ని స్పీకర్ ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ, నాయకులు సుధాకర్ రెడ్డి, చిగుళ్లపల్లి రమేశ్‌కుమార్, మురళీ, రెడ్యానాయక్ , రాజు కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పతకాలు సాధించిన వారిని అభినందిస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి

7పతకాలు సాధించడం అభినందనీయం

» వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి

వికారాబాద్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌లో ఏడు పతకాలు సాధించడం ఆనందంగా ఉందని ఎస్పీ నారాయణరెడ్డి తెలిపారు. సోమవారం రాష్ట్ర స్థాయి స్పోర్ట్స్ పోటీల్లో పతకాలు సాధించిన వారిని ఆయన సోమవారం అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విధి నిర్వహణలో ఎన్ని ఒత్తిళ్లు ఉన్నా కచ్చితంగా ప్రతి ఒక్కరూ ఆటల పోటీల్లో పాల్గొనేటట్లు అలవాటు చేసుకోవాలన్నారు. ఆటల వల్ల పోలీసులకు మోటివేషన్‌తో పాటు నైపుణ్యాలను ప్రోత్సహించేందుకు ఉపయోగపడుతుందన్నారు. క్రీడల్లో గెలుపు ఓటములు ముఖ్యం కాదన్నారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ వీరేశ్, ఆర్ఐ అంజాత్ పాషా, డేవిడ్, ఎస్ఐలు, పతకాలు సాధించిన పోలీస్ అధికారులు శివదర్శన్, అబ్దుల్ మన్సూర్, స్వాతి, ప్రకాశ్, శ్రీను, రవీందర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పల్లెల్లో సందడి!

పంచాయతీ పోరుకు సన్నాహాలు

పంచాయతీ ఎన్నికలకు అధికార యంత్రాంగంతో పాటు రాజకీయ పార్టీలు పూర్తి స్థాయిలో సన్నద్ధమవుతున్నాయి. 15వ తేదీలోగా నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉందని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి రెండు రోజుల కిందట సంకేతాలు ఇవ్వడంతో గ్రామాల్లో రాజకీయ సందడి మొదలైంది. సర్పంచ్, వార్డు అభ్యర్థుల ఎంపికపై ఆయా పార్టీలు ఇప్పటికే కేడర్‌తో మంతనాలు జరుపుతున్నాయి. పార్టీల గుర్తులతో సంబంధం లేకుండా ఈ ఎన్నికలు జరగనున్నప్పటికీ అన్ని పార్టీలు సవాల్‌గా తీసుకుంటున్నాయి. మరో వైపు పంచాయతీ ఎన్నికలు జరిగే వరకు పంచాయతీ కార్యదర్శులకు సెలవులు రద్దు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 1,168 పంచాయతీలున్నాయి.



- ఎన్నికల నోటిఫికేషన్‌పై ప్రభుత్వ సంకేతాలు
- సన్నద్ధమవుతున్న రాజకీయ పార్టీలు
- పంచాయతీ కార్యదర్శులకు సెలవులు బంద్
- అత్యవసరమైతే ఆధారపత్రాలుంటే మంజూరు
- రిజర్వేషన్లపై సర్వత్రా నెలకొన్న ఆసక్తి
- అధికార పార్టీకి సవాల్‌గా స్థానిక ఎన్నికలు



రంగారెడ్డి కలెక్టరేట్‌కు చేరిన పోస్టల్ బ్యాలెట్ పత్రాలు

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి): స్థానిక ఎన్నికల నిర్వహణకు దాదాపు మార్గం సుగమమం కావడంతో ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తోంది. బీసీ రిజర్వేషన్ల ప్రకటన తర్వాతనే ఎన్నికలు నిర్వహిస్తామని ఇంతకు ముందు ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. కులగణనపై ఇప్పటికే ప్రభుత్వానికి నివేదిక అందింది. దీన్ని నేడు అసెంబ్లీలో ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది. అలాగే ఎస్సీ వర్గీకరణపై కూడా ప్రభుత్వం అసెంబ్లీలో నివేదిక పెట్టేందుకు సిద్ధమైంది. ఈ రెండు నివేదికలను అసెంబ్లీలో ప్రవేశపెట్టిన అనంతరం ఇందుకు అనుగుణంగా రిజర్వేషన్లు ఖరారు చేసి పంచాయతీ ఎన్నికలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వనుంది. దాదాపు ఇందుకు సంబంధించిన కసరత్తు అధికార యంత్రాంగం దాదాపు పూర్తిచేసింది. అలాగే ఎన్నికలు జరిగే వరకు పంచాయతీ కార్యదర్శులకు ప్రభుత్వం సెలవులు రద్దు చేసింది. అత్యవసర పరిస్థితుల్లో తగిన ఆధారాలు చూపిన వారికి మాత్రమే నిబంధనల మేరకు సెలవులు మంజూరు చేయాలని ఆదేశించింది. ముందస్తు

మిగతా 7వ పేజీలో...

మూడు జిల్లాల వివరాలు

జిల్లా	మండలాలు	పంచాయతీలు	వార్డులు
రంగారెడ్డి	21	549	4,896
మేడ్చల్	3	34	320
వికారాబాద్	18	585	4,982

అభ్యంతరాలను

సరిచేసుకోవాలి

» డీఎంహెచ్‌వో వెంకటరవణ



వికారాబాద్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్యారోగ్య శాఖలో ఎస్ఎస్‌సీయూ, ఎంహెచ్ఎన్, ఎన్‌సీడీ స్కీములో ఖాళీగా ఉన్న సాఫ్‌నర్సు పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ప్రొవిజినల్ మెరిట్ జాబితా జిల్లా అధికారిక వెబ్‌సైట్ వికారాబాద్.తెలంగాణ.జీవోవీ.ఐఎన్‌లో పొందుపర్చినట్లు డీఎంహెచ్‌వో వెంకటరవణ ఒక ప్రకటనలో తెలిపారు. లిస్టులో రిమార్క్స్ సూచించిన అభ్యంతరాలను సరి చేసుకునేందుకు నేటి నుంచి నుండి 7వ తేదీ వరకు అన్ని పనిదినాల్లో ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు అప్లికేషన్ జత చేసి కలెక్టర్ కార్యాలయంలో ఎస్ఐ17లోని జిల్లా ఆరోగ్య శాఖ కార్యాలయంలో సమర్పించాలన్నారు. గడువు ముగిసిన తరువాత ఎలాంటి అభ్యర్థనలు స్వీకరించడం అనుమతించమని పేర్కొన్నారు.

భూములిచ్చిన రైతులకు

నష్టపరిహారం, ఇంటి స్థలం

» కలెక్టర్ ప్రతీక్ జైన్

కలెక్టరేట్‌లో రైతులతో చర్చలు



ప్రజావాణిలో అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక పార్క్ ఏర్పాటుకు భూములను ఇచ్చేందుకు సమ్మతించిన రైతులకు నష్ట పరిహారంతో పాటు అప్రూవ్డ్ లే అవుట్ ప్రకారం ఇంటి స్థలాలను ఇస్తామని కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో దుద్యాల్ మండలం హకీమ్‌పేట్ గ్రామ రైతులతో కలెక్టర్ చర్చలు జరిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 218 మంది రైతులకు సంబంధించి హకీంపేట గ్రామంలో మొత్తం 351 ఎకరాల భూమి ఉందని దీనిపై రైతులతో చర్చ జరిపి రైతుల సమ్మతాన్ని పొందినట్లు తెలిపారు. సమ్మతి అవార్డు పొందిన రైతులకు ఒకే దఫాలో చెక్కుల ద్వారా నష్ట పరిహారాన్ని చెల్లిస్తామన్నారు. రైతులు ఎలాంటి అపోహలకు తావు ఇవ్వకూడదన్నారు. ఎకరానికి రూ.20 లక్షలు, 150 గజాల ఇంటి స్థలం ఇందిరమ్మ ఇల్లు, అర్హతల మేరకు ఇంటికి ఒక ఉద్యోగం కల్పించనున్నట్లు తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి, టీజీఐఐసీ జోనల్ మేనేజర్ శారద, అసిస్టెంట్ జోనల్ మేనేజర్ అజీమ సుల్తానా, దుద్యాల తహసీల్దార్ కిషన్, హకీంపేట రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఖాళీ పోస్టుల వివరాలు ఇవ్వండి

శాఖల వారీగా ఖాళీగా ఉన్న పోస్టుల వివరాలను సమర్పించాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణిలో భాగంగా అధికారులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. కారుణ్య నియామకాల్లో భాగంగా ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న టైపిస్టు, జూనియర్ అసిస్టెంట్, ఆఫీసర్ సబార్డినేట్‌పోస్టుల భర్తీకి సంబంధించి వివరాలను రోస్టర్ పాయింట్ వారీగా ఖాళీల వివరాలను వెంటనే సమర్పించాలని ఆదేశించారు. అలాగే ప్రజావాణిలో 106 దరఖాస్తులు అందులో కారుణ్య నియామకాలు, ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్, రైతు భరోసా, రుణమాఫీ తదితరాలకు సంబంధించిన దరఖాస్తులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి, ఆర్డీవో వాసుచంద్ర, ప్రజల నుంచి విజ్ఞప్తులను స్వీకరించారు.

మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో

కందుల కొనుగోళ్లు

మార్క్‌ఫెడ్ అధికారి తహీమిన



వికారాబాద్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఐదు కందుల కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినట్లు మార్క్‌ఫెడ్ అధికారి తహీమిన ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 20న కొడంగల్ పీఏసీఎస్, మర్పల్లి పీఏసీఎస్, తాండూరు డీసీఎంఎస్, వికారాబాద్ డీసీఎంఎస్, పరిగి డీసీఎంఎస్‌లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో ప్రతి రోజు సెంటర్‌లలో రైతులకు ఎస్ఎస్‌పీ రేటు రూ.7,550కు అమ్ముకోవాలని అవగాహన కల్పిస్తూ దళారులు చేతుల్లో మోసపోకుండా మా సెంటర్ వద్దకు వచ్చి ఎంఎస్‌పీ ధరకు అమ్ముకొని లబ్ధిపొందాలని రైతులకు వివరించారు. సందేహాలు ఉంటే 72888798812 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

రూ.2.79 లక్షల రికవరీకి ఆదేశం

» రూ.55వేలు జరిమానా చెల్లించాలి
» ఎన్ఆర్ఈజీఎస్ పీడీ శ్రీనివాస్ ఆదేశాలు
» 'ఉపాధి హామీ' సామాజిక ఆడిట్



ఉపాధి హామీ సిబ్బందితో మాట్లాడుతున్న పీడీ శ్రీనివాస్

తాండూరు రూరల్, ఫిబ్రవరి 3, (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం కింద నిధులు దుర్వినియోగం అయితే ఆ నిధులను తిరిగి చెల్లించాల్సిందేనని ఎన్ఆర్ఈజీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాస్ హెచ్చరించారు. సోమవారం తాండూరు మండల పరిధిలో 33 పంచాయతీలు, 8 అనుబంధ గ్రామాల్లో జరిగిన ఉపాధి హామీ పనులపై సామజిక తనిఖీ నిర్వహించారు. అప్పటి ఎంపీడీవో సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏడాది కాలంలో జరిగిన 752 పనులకు సంబంధించి రూ.4,27,59,417 కూలీల ఖాతాల్లో జమచేశారు. మెటీరియల్ కింద రూ.17,25,238 చెల్లించారు. మొత్తం రూ.4,44,84,655 నిధులకు సంబంధించి తనిఖీలు చేపట్టారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో విశ్వప్రసాద్ ఆధ్వర్యంలో 15వ విడత సోషల్ ఆడిట్‌కు సంబంధించిన వివరాలను ఎన్ఆర్ఈజీఎస్ పీడీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నివేదికలను చదివి వినిపించారు. కొన్ని గ్రామాల్లో ఫార్మేషన్ రోడ్లు వేయాల్సిన ఎత్తుకంటే తక్కువ వేయడం, మరి కొన్ని చోట్ల రోడ్డు కొలతలు తక్కువ రావడం, పలు పనులకు రెండుసార్లు పేమెంట్లు చేయడం వంటి నిధుల దుర్వినియోగంపై వివరాలు వెల్లడించింది. మాస్టర్ క్లోజ్ చేసి పేమెంట్లు చేయడం, జాబ్ కార్డులో పేరున్న వారు కాకుండా ఇతరులు పనిచేయడం వంటి వాటిపై చర్చించారు. ఆయన పనులపై నిర్లక్ష్యం చేసినందుకు వారికి రూ.55వేల జరిమానా విధించినట్లు అధికారులు తెలిపారు. మరో రూ.2,79,080 సొమ్మును రికవరీకి ఆదేశించారు. కార్యక్రమంలో కాడా అధికారి సుదర్శన్‌రెడ్డి, ఏపీడీ సరళ, ఏపీవో భార్గవి, అంబుడ్స్‌మెన్ రాములు, ఏపీవో నరోత్తంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఫిర్యాదులను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

» అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి
» ప్రజావాణిలో 61 దరఖాస్తుల స్వీకరణ

మేడ్చల్ ప్రతినిధి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఆయన ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు తరలివచ్చి అందించే ఫిర్యాదులను సంబంధిత అధికారులు వెంటనే పరిష్కరించాలన్నారు. ఫిర్యాదులపై చర్యలను వివరిస్తూ ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్లోడ్ చేయాలన్నారు. దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ప్రజావాణిలో మొత్తం 61 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాధికాగుప్తా, డీఆర్‌వో హరిప్రియ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

తాండూరు జిల్లా ఆస్పత్రికి

'కొడంగల్ బోర్డు'

అయోమయంలో నాయకులు, ప్రజలు

చివరకు తొలగించిన అధికారులు



అయోమయంతో బోర్డును చూస్తున్న జనం

తాండూరు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): పొరపాటో.. గ్రహపాటో.. తెలియదు కానీ ఏకంగా ఏళ్లుగా కొనసాగుతున్న తాండూరు జిల్లా ఆస్పత్రి బోర్డును సోమవారం రాత్రికి రాత్రే 'ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, కొడంగల్'గా మార్చేస్తూ కొత్త బోర్డును ఏర్పాటు చేశారు. దీనిపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతడంతో పాటు సోషల్ మీడియాలోనూ వైరల్‌గా మారింది. ఈ బోర్డును చూసిన నాయకులు, ప్రజలు, రోగులు ఇదేంటని ఆశ్చర్యంగా చర్చించుకున్నారు. ఒక నియోజకవర్గంలో ఉన్న ఆస్పత్రికి మరో నియోజకవర్గం పేరు పెట్టడం ఏమిటని పలువురు ప్రశ్నించారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల ఇలా జరిగిందని ఆస్పత్రి సూపరిండెంట్ డాక్టర్ శెట్టి రవిశంకర్ మీడియాకు వివరించారు. ఈ బోర్డు మార్పు విషయమై ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి దృష్టికి స్థానిక కాంగ్రెస్ నాయకులు, మాజీ కౌన్సిలర్లు తీసుకెళ్లారు. చివరకు రాత్రి 9 గంటల సమయంలో ఆ బోర్డును తొలగించడం గమనార్హం.

మెడికల్ కాలేజీ నామ్స్ కోసమే బోర్డు

మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి



కొడంగల్‌కు మంజూరైన మెడికల్ కాలేజీ ఏర్పాటు అనుమతుల కోసమే ఈ బోర్డును మార్చారని మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి ఆరోపించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ మెడికల్ కాలేజ్ నామ్స్ కోసమే ఈ బోర్డును ఏర్పాటు చేశారన్నారు. ఆస్పత్రిలోనున్న సౌకర్యాలు, ఫర్నిచర్‌ను చూపించడం కోసమే ఈ బోర్డు ఏర్పాటు చేసి ఫొటోలు, వీడియోలు తీసి తర్వాత తొలగించారని ఆరోపించారు.



రాంపూర్‌లో ఓ రైతు పొలంలో నిల్వ చేసిన వేరుశనగ పంట

7 కిలోలు తరుగు.. 4 శాతం కమీషన్

వేరుశనగ కొనుగోళ్లలో దోపిడీ

రైతులను ముంచుతున్న వ్యాపారులు

మార్కెట్ ఫీజు ఎగవేత

ధారూరు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): వేరుశనగ కొనుగోళ్లలో వ్యాపారులు రైతులను నిలువుదోపిడీ చేస్తున్నారు. మార్కెట్‌లో సరైన ధర లేకపోవటంతో కొంత మంది వ్యాపారులు నేరుగా రైతుల నుంచి లారీల కొద్ది పంటను కొనుగోలు చేస్తున్నారు. బొంరాసిపేట్ మండలం, తుంకిమెట్ల, పరిగి ప్రాంతాల నుంచి వ్యాపారులు మండల పరిధిలోని రాంపూర్ తండాకు వచ్చి క్వింటాల్‌కు రూ.5,800 చొప్పున చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. 30కిలోల బస్తాకు 2.200 కిలోల తరగు లెక్కన క్వింటాలుకు 7 కిలోల వరకు తరుగు తీస్తున్నారు. అలాగే వందకు 4 శాతం కమీషన్‌ను కట్ చేసి డబ్బులు చెల్లిస్తూ, హమాలీ, రవాణా ఖర్చులంటూ కట్ చేసి ఇస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ దోపిడీపై ప్రశ్నించిన రైతులను దళారులు బెదిరిస్తున్నారని వివరించారు. కాగా, వ్యాపారులు మార్కెట్‌కు ఫీజ్ సైతం చెల్లించకుండానే లారీల కొద్ది వేరుశనగ సంచులను ఖరీదు చేసి తరలిస్తున్నారని కొంతమంది తండా రైతులు వాపోతున్నారు. వేరుశనగతో పాటు మొక్కజొన్న, ఇతర పంటల కొనుగోళ్లలో జరుగుతున్న జీరో దందాపై మార్కెట్ అధికారుల నిఘా కరువైంది.

బీజేపీ ఎంపీలు రాజీనామా చేయాల్సిందే

- బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం
- పరిగి ఎమ్మెల్యే రాంమోహన్‌రెడ్డి


వికారాబాద్ అంబేడ్కర్ విగ్రహం వద్ద కేంద్రం దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

వికారాబాద్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ బీజేపీ ఎంపీలు రాజీనామా చేయాలని, కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని పరిగి ఎమ్మెల్యే రాంమోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు వికారాబాద్ పట్టణంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీజేపీ తెలంగాణ ఎంపీలు రాజీనామా చేసి కేంద్రంపై ఒత్తిడి తీసుకు రావాలన్నారు. స్థానికంగా బీజేపీ ఉన్న ఈ ప్రాంతానికి వచ్చింది ఏమీ లేదన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు రెండు ఒక్కటేనని మండి పడ్డారు. కార్యక్రమంలో నాయకులు సుధాకర్‌రెడ్డి, సత్యనారాయణ, చిగుళ్లపల్లి రమేష్ కుమార్, సురేష్, అనంత్‌రెడ్డి, శ్రీను ముదరాజ్ తదితరులు పాల్గొన్నారు. కాగా, సాయంత్రం 4.30 గంటలకు నిరసన నిర్వహించాలని నాయకులు నిర్ణయించారు. రాంమోహన్‌రెడ్డి సరైన సమయానికి అక్కడికి చేరుకున్నా గానీ, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ వికారాబాద్‌లోని వెంకటాపూర్ తండాలో నిర్వహించిన పూజా కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారని, దీంతో ఈ కార్యక్రమం ఆలస్యమైందని పార్టీ నేతలు చర్చించుకున్నారు.

స్థానిక ఎన్నికలకు సన్నద్ధం కావాలి

మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్

మహేశ్వరం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలకు సమయం ఆసన్నమైందని, ఈ ఎలక్షన్‌లో అత్యధిక స్థానాలు గెలుచుకునేందుకు కాంగ్రెస్ నాయకులు సిద్ధం కావాలని మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం కాంగ్రెస్ ఇన్‌చార్జి కేఎల్లార్ అన్నారు. సోమవారం తుక్కుగూడ పార్టీ కార్యాలయంలో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల కోసం ఏడాదిగా ఎదురుచూస్తున్న ఆశావహులందరికీ మంచి రోజులొచ్చాయన్నారు. మరో రెండు వారాల్లో జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికలకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశం ఉందన్నారు. పోటీ చేసే నాయకులు తగిన ఏర్పాట్లను చేసుకోవాలన్నారు. మున్సిపల్ ఎన్నికలు కాస్త ఆలస్యం అయ్యే అవకాశం ఉన్నందున ముందుగా పంచాయతీ ఎన్నికలు జరుగుతాయన్నారు. ఈ ఎన్నికల్లో పోటీ చేసే నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వం అమలు పరుస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను గ్రామాల్లోని ప్రజలకు అందేలా చూడడంతో పాటు వాటిని విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. జనాభాలో సగం బీసీలు ఉన్నందున వారికి రిజర్వేషన్‌ల కోటా పెంచేందుకే కులగణన సర్వే చేసినట్లు చెప్పారు. సర్వేలో 46.25 శాతం తేలిందన్నారు. జనాభా దామాషా ప్రకారం వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో సీట్లు కేటాయింపులుంటాయన్నారు. టీపీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి, ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ నందిగామ నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదు

- మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్
- ప్రజలను మోసగించిదంటూ విమర్శ

ఆమనగల్లు , ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను మోసగించి అధికారంలోకి వచ్చాక అమలులో విఫలమైన కాంగ్రెస్‌కు స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన గుణపాఠం తప్పదని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్ అన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ , కేంద్రంలోని బీజేపీ వైఫల్యాలు, ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ బీఆర్ఎస్ శ్రేణులంతా ప్రజల పక్షాన పోరాటాలు సాగిస్తూ స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలని పిలుపు నిచ్చారు. ఆమనగల్లు మున్సిపాలిటీ చంద్రాయన్‌పల్లి తండాలో సోమవారం బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆమనగల్లు మున్సిపాలిటీ పార్టీ అధ్యక్షుడు నేనావత్ పత్యానాయక్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తండాలో బీఆర్ఎస్ జెండాను ఆవిష్కరించారు. చంద్రాయన్‌పల్లి తండా, శ్రీరామ్ నగర్ తండాలకు చెందిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పత్యానాయక్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున జైపాల్ యాదవ్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారికి గులాబీ కండువాలు కప్పి స్వాగతించారు. ఈ సందర్భంగా తండాలో ర్యాలీ నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వంద ఎకరాల్లో పశుగ్రాసం దగ్ధం


నక్కగుట్టతండా వద్ద మంటలు ఆర్పుతున్న పోలీసులు

యాచారం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : యాచారం మండలం నక్కగుట్టతండాలో సోమవారం మధ్యాహ్నం పశుగ్రాసం దగ్ధమైంది. మంటలు అంటుకొని వంద ఎకరాల్లో ఉన్న భూముల్లోని గ్రాసం దగ్ధమైంది. ఇది గుర్తు తెలియని దుండగులు పనేనని స్థానిక రైతులు వాపోయారు. రోడ్డు వెంట వెళ్తున్న యాచారం పెట్రోమొబైల్-2 పోలీసులు గమనించి వెంటనే ఇబ్రహీంపట్నంలో ఉన్న ఫైరింజన్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు ఇక్కడికి చేరుకొని మంటలను ఆర్పారు. ఆ మేరకు ఎండాకాలం అంతా పశువులకు మేత కొరత ఉండేది కాదని రైతులు కన్నీటిపర్యంతమయ్యారు. తమకు ప్రభుత్వం సాయం చేయాలని కోరుతున్నారు.

పాఠశాలల సమయానికే
బస్సులు నడపాలి

- ఆర్టీసీ డీఎంకు వినతి


ఆర్టీసీ డీఎంతో పీఏసీఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి

యాలాల, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల సమయానికే బస్సులు నడపాలని యాలాల పీఏసీఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి కోరారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు సోమవారం తాండూరు ఆర్టీసీ డీఎంను ఆయను కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. సమయానికి బస్సులు లేకుండా విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు. దౌలాపూర్, తిమ్మాయిపల్లి, బండమీదిపల్లి, బెన్నూరు, జక్కేపల్లి, లక్ష్మీనారాయణపూర్ తదితర గ్రామానికి చెందిన విద్యార్థులు అగ్గనూరు జెడ్పీహెచ్ఎస్‌లో చదువుతున్నారన్నారు. ఈ గ్రామాల విద్యార్థులందరూ లక్ష్మీనారాయణపూర్ చౌరస్తాకు వచ్చి బస్సుల కోసం గంటల తరబడి ఎదురు చూడాల్సి వస్తుందని పేర్కొన్నారు. త్వరితగతిన తాండూరు నుంచి అగ్గనూరు వెళ్లేందుకు బస్సు సౌకర్యం కల్పించాలని డీఎంను కోరారు. సాయంత్రం వేళల్లోనూ అదనంగా అగ్గనూరు నుంచి లక్ష్మీనారాయణపూర్ చౌరస్తా వరకు ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. సానుకూలంగా స్పందించిన డీఎం... పాఠశాలల సమయానికి బస్సులను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారన్నారు.

నయనానందకరం శ్రీవారి కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు , హాజరైన భక్తులు

- భారీగా తరలొచ్చిన భక్తజనం
- పాల్గొన్న పలువురు ప్రముఖులు

ఆమనగల్లు , ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): అలివేలుమంగ సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. ఆమనగల్లు మండలం శెట్టిపల్లి వేంకటేశ్వర స్వామి దేవాలయ బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం ఆలయాన్ని, కల్యాణ మండపాన్ని శోభాయామానంగా అలంకరించారు. కాగా, స్వామి వారి మూలవిరాట్లను ఆలయం నుంచి మండపానికి మాజీ సర్పంచ్ ఎగిరిశెట్టి గోదాదేవిసత్యం, ఆలయ చైర్మన్ సింగిని శ్రీనివాస్, ఆలయ మేనేజింగ్ ట్రస్టీ కోట్ల జగన్మోహన్, అర్చకులు గూడ కృష్ణమాచార్యులు పూర్ణకుంభంతో కల్యాణ మండపానికి తీసుకువచ్చారు. మేళతాళాలు, వేద మంత్రాల నడుమ స్వామి వారి కల్యాణోత్సవాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఆయా ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలొచ్చారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి , రాష్ట్ర కాలుష్య నియంత్రణమండలి సభ్యుడు బాలాజీ సింగ్ సైతం హాజరయ్యారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోనుగోటి అర్జున్ రావు, రాష్ట్ర కాలుష్యనియంత్రణ మండలి సభ్యుడు బాలాజీ సింగ్, టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, నాయకులు సింగం జంగయ్య, సింగం శ్రీనయ్య, వెంకటయ్య, వెంకటేశ్, భవాని ,రోహిత్, బాస్కర్ రావు, నర్సింహ, మహేశ్, వంశీ, నవీన్, తదితరులు పాల్గొన్నారు.


కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

బోధన తీరులో మార్పు రావాలి

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి) : మారుతున్న విద్యావిధానంతో పాటు అధ్యాపకులు బోధించే బోధనలో మార్పు రావాలని నేపాల్‌కు ప్రొఫెసర్ డాక్టర్ సుభాష్ శ్రేష్ఠ తెలిపారు. కాచవానిసింగారంలో ఉన్న నల్ల మల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీలో సోమవారం జరిగిన డిజిటలైజేషన్ ఆఫ్ ఎడ్యుకేషన్ అంతర్జాతీయ సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థులు అత్యుత్తమ బోధన, శోధన విద్యార్థుల నైపుణ్యాభివృద్ధి ప్రాతిపదికన ఈ సదస్సులో ఒప్పందాలు జరిగాయన్నారు. బోధన, శిక్షణలతో డిజిటలైజేషన్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఈ సదస్సు ముఖ్య లక్ష్యమన్నారు. అధ్యాపకులు విద్యార్థులకు అర్థమయ్యే విధానంలో బోధన చేయాలని సూచించారు. సంస్థకు అవరమయ్యే పరిశోధనలు విద్యార్థులు చేయాలని, అందుకు తగిన విధంగా పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని అన్నారు. ఐదు రోజుల పాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అంశంపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ నల్ల దివ్యా, ప్రొఫెసర్లు రిషబ్‌ఖానాల్, సరోజ్ శ్రేష్ఠ, రూపర్డ్ బవానార్, లేజియన్ వాస్కలిన్, షాలిని బేరియార్, సతీష్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



భూమి పూజ చేస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి

▸▸ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి

బొంరాస్‌పేట్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బురాన్‌పూర్ గ్రామంలో రూ.61 లక్షలతో పాఠశాల అదనపు తరగతి గదుల నిర్మాణానికి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి సోమవారం భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. విద్య, వైద్యం, ఉపాధి కోసం సీఎం రేవంత్‌రెడ్డి కొడంగల్ ప్రాంతంపై ప్రత్యేక చొరవతో నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సిములుగౌడ్, నాయకులు రాంచంద్రారెడ్డి, నర్సిములునాయుడు, పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ, భీమయ్యగౌడ్, నర్సిములుయాదవ్, దేశ్యానాయక్, మహిపాల్, రాములు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంటేకార్ భగీరథ్

'వైఫల్యాలు కప్పిపుచ్చేందుకే కుట్ర రాజకీయాలు'

కడ్తాల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి కుట్రరాజకీయాలు సాగిస్తోందని బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి కాంటేకార్ భగీరథ్ ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌పై కాంగ్రెస్ నాయకులు విమర్శలు చేయడం, అంబేడ్కర్ విగ్రహాల వద్ద ఆందోళన కార్యక్రమాలు నిర్వహించడం వారి అవకాశ వాద రాజకీయాలకు నిదర్శనమన్నారు. కడ్తాల మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో భగీరథ్ మాట్లాడుతూ కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల ప్రవేశ పెట్టిన బడ్జెట్ అన్ని వర్గాలకు సమన్యాయం చేసేలా ఉందన్నారు. కాంగ్రెస్ నాయకులు అవగాహన లేకుండా బడ్జెట్‌పై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. ఆ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలులో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. కాంగ్రెస్‌ను ప్రజలు విశ్వసించే పరిస్థితి లేదని పేర్కొన్నారు. సమావేశంలో బీజేవైఎం మండల ఉపాధ్యక్షుడు సురేశ్ నాయక్, కార్యదర్శి మల్లేశ్ నాయక్, నాయకులు కళ్యాణ్, ఉమేశ్, సాయి, అభి, ఆనంద్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.



వసంతి పంచమి వేడుకల్లో డీన్ రామారావు తదితరులు

ఘనంగా వసంత పంచమి వేడుకలు

మొయినాబాద్ రూరల్, ఫిబ్రవరి3(ఆంధ్రజ్యోతి): ప్రకృతిపరమైన చైతన్య ప్రకాశానికి సరస్వతీదేవి మనో వికాసానికి ప్రతీక అని ఎన్టీఆర్ విద్యా సంస్థల డీన్ రామారావు అన్నారు. మొయినాబాద్ మండలంలోని ఎన్టీఆర్ విద్యాసంస్థల్లో రెండు రోజులుగా వసంతి పంచమి వేడుకలు, సరస్వతీ పూజా కార్యక్రమాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌తో బీఆర్ఎస్ నాయకులు

ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను కలిసిన నేతలు

కొడంగల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను కొడంగల్ మండలం అంగడిరైచూర్‌కు చెందిన నర్మద కిష్టప్ప కలిశారు. సోమవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి నాయకత్వంలో పని చేస్తూ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటం చేయాలని సూచించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



దేవాలయ మండపం, స్వామి వారి మూలవిరాట్టు

బ్రహ్మోత్సవాలకు వేళాయె

చెన్నకేశవ స్వామి ఆలయం ముస్తాబు

▸▸ ఎనిమిది నుంచి ప్రారంభం.. ఏడు రోజుల పాటు నిర్వహణ

▸▸ మౌలిక సదుపాయాల కల్పనలో నిమగ్నం

కడ్తాల్ , ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రముఖ పుణ్య క్షేత్రంగా ప్రసిద్ధి గాంచిన కడ్తాల మండల కేంద్రంలోని లక్ష్మీచెన్నకేశవ స్వామి దేవాలయం బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. యేటా ఈ దేవాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆ మేరకు ఈనెల 8 నుంచి 14వ తేదీ వరకు నిర్వహించనున్న ఈ ఉత్సవాల కోసం ఆలయ నిర్వాహకులు మౌలిక సదుపాయాల కల్పనలో నిమగ్నమయ్యారు. కాగా, అర్చకుడు మెళ్లూరి వెంకటేశ్వర శర్మ పర్యవేక్షణలో వేడుకలు జరగనున్నాయి. కడ్తాల, తలకొండపల్లి, కందుకూరు, ఆమనగల్లు, కేశంపేట, యాచారం, ఇబ్రహీంపట్నం, మహేశ్వరం తదితర ప్రాంతాల నుంచి బ్రహ్మోత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరానున్నారు. ఏడు రోజుల పాటు కొనసాగే బ్రహ్మోత్సవాలకు దేవాదాయ శాఖ అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు, గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు గావించారు.

కనులపండువగా లక్ష్మీ చెన్నకేశవ కల్యాణం

తలకొండపల్లి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయాలలో సోమవారం స్వామి వారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని అందంగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరాగా నిర్వాహకులు అన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్, మిషన్ భగీరథ రాష్ట్ర మాజీ వైస్‌చైర్మన్ ఉప్పల వెంకటేశ్, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడు బాలాజీసింగ్, పీఏసీఎస్ చైర్మన్ గట్ల కేశవరెడ్డి, మాజీ ఎంపీపీ నిర్మలాశ్రీశైలం గౌడ్ హాజరయ్యారు. అర్చకుడు మహేశ్ ఆధ్వర్యంలో కల్యాణం జరిపించారు. కల్యాణం అనంతరం భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. మాజీ సర్పంచ్ లలితాజ్యోతయ్య, నాయకులు, భక్తులు తుమ్మ నర్సింహ, యాదయ్య, యాదగిరి, పాండు, పురుషోత్తం, సురేశ్, వెంకటేశ్, రాములు, పాపయ్య, ప్రవీణ్, మల్లేశ్, వెంకటయ్య పాల్గొన్నారు.



తలకొండపల్లిలో స్వామి వారి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు



పూజలో మధుసూదన్‌రెడ్డి, తదితరులు

ఘనంగా ఆలయ ప్రారంభోత్సవం

షాబాద్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మాచన్‌పల్లి కట్టమైసమ్మ ఆలయం ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. సోమవారం అమ్మవారిని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌రెడ్డి, కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, పీసీసీ కార్యదర్శి రాంరెడ్డి, మహేందర్‌గౌడ్, సుభాష్‌రెడ్డి తదితరులు ప్రత్యేక పూజలు చేశారు.

పల్లెల్లో సందడి!

(ఐదో పేజీ తరువాయి)

సమాచారం లేకుండా సెలవులు తీసుకుంటే చట్టపరమైన తీసుకుంటామని హెచ్చరించింది.

గుర్తులు ఖరారు

ఇప్పటికే వికారాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో ఓటర్ల జాబితా సవరణ పూర్తి చేశారు. అలాగే ఓటర్ల సంఖ్య ఆధారంగా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడంతో పాటు వీటికి అనుగుణంగా బ్యాలెట్ బాక్సులు సిద్ధం చేశారు. సిబ్బంది నియామకాలు సైతం చేపట్టారు. అలాగే వారితో క్షేత్రస్థాయిలో సమావేశాలు నిర్వహించారు. ఎన్నికలకు గుర్తులు కూడా ఖరారు చేశారు. సర్పంచ్ ఎన్నికలకు సంబంధించి 30, వార్డు సభ్యులకు 20 గుర్తుల చొప్పున ఖరారు చేశారు. ఈ సారి బీసీలకు జనాభా ఆధారంగా స్థానాలు పెంచుతామని ప్రభుత్వం ప్రకటించడంతో ఇప్పటి నుంచే రాజకీయ నేతలు ఆరా తీస్తున్నారు. వాస్తవానికి గత జనవరి నెలాఖరు నాటికే పంచాయతీల్లో కొత్త పాలకవర్గాలు కొలువు తీరాల్సి ఉంది. అయితే లోక్‌సభ ఎన్నికల కారణంగా పంచాయతీ ఎన్నికలు వాయిదా వేసి గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలన తీసుకువచ్చారు. పంచాయతీ ఎన్నికలు ముగిసిన తరువాత జిల్లా పరిషత్, మండల పరిషత్ ఎన్నికలు కూడా నిర్వహించాలని సర్కార్ భావిస్తోంది.

మూడు విడతల్లో ఎన్నికలు

పంచాయతీ ఎన్నికలను మూడు విడతలుగా నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎన్నికల సంఘం గతంలోనే అధికార ప్రకటన చేసింది. పంచాయతీ ఎన్నికల్లో 650 మంది ఓటర్లకు ఒక పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయనున్నారు. అంతకు మించి ఓటర్లు ఉంటే మరో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేస్తారు. 200 మంది వరకు ఓటర్లు ఉన్న చోట ఒక ప్రిసైడింగ్ అధికారి, ఒక పోలింగ్ అధికారి ఉంటారు. అలాగే 201 నుంచి 400 ఓట్లకు ఒక ప్రిసైడింగ్ అధికారి, ఇద్దరు పోలింగ్ అధికారులు, 401 నుంచి 650 ఉన్న చోట ఒక ప్రిసైడింగ్ అధికారి, ముగ్గురు పోలింగ్ అధికారులను నియమిస్తున్నారు. కొత్తగా ఏర్పాటు చేసిన పంచాయతీల్లో కూడా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు.



బీఆర్ఎస్, బీజేపీల ముమ్మర కసరత్తు

ప్రభుత్వ సంక్షేమ పథకాలు రైతుభరోసా, ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల పంపిణీకి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై విస్తృత ప్రచారం నిర్వహించాలని పార్టీ నాయకత్వం ఇప్పటికే కేడర్‌కు ఆదేశాలు జారీ చేసింది. రేషన్‌కార్డులు, ఇళ్ల వంటి విషయాల్లో ఎవరో ఆందోళన చెందకుండా అర్హులైన వారందరికీ లబ్ధి చేకూరుస్తామనే హామీని ఇవ్వాలని ఆదేశించింది. ఇదిలా ఉంటే ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీలు కూడా పంచాయతీ పోరుకు పూర్తి స్థాయిలో రెడీ అవుతున్నాయి. నగర శివార్లలో బీజేపీ, బీఆర్ఎస్‌లకు మంచి కేడర్ ఉంది. దీంతో ఈ స్థానాలను తిరిగి మళ్లీ కాపాడుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశాయి. ఇందులో భాగంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తరుచూ జిల్లాలో పర్యటిస్తున్నారు. ఏదో చోట ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మరో వైపు బీజేపీ కూడా క్షేత్రస్థాయిలో కేడర్‌ను సమయాత్తం చేస్తోంది. రాష్ట్ర, జిల్లా నేతలు ఉమ్మడి జిల్లాలో పర్యటించి సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థుల ఎంపికపై కసరత్తు చేస్తున్నారు.

అధికార పార్టీకి సవాల్

ఈ ఎన్నికలు అధికార కాంగ్రెస్‌కు సవాల్‌గా మారాయి. అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినప్పటికీ క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయిలో పార్టీ బలపడలేదు. తరుచూ ఏదో అంశాలపై ప్రతిపక్షాలు చేపడుతున్న ఆందోళన కార్యక్రమాలు అధికార కాంగ్రెస్‌కు చికాకు తెప్పిస్తోంది. స్థానిక ఎన్నికల్లో పార్టీల గుర్తులతో సంబంధం లేకున్నా కేడర్‌ను గెలిపించుకునేందుకు ఆయా రాజకీయ పార్టీలు పోటీపడుతుంటాయనేది తెలిసిందే. ముఖ్యంగా పంచాయతీ ఎన్నికల్లో 90శాతానికిపైగా స్థానాలు గెలుచుకునేందుకు కాంగ్రెస్ పార్టీ వ్యూహరచన చేస్తోంది. గతంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయంలో మాత్రమే కాంగ్రెస్ పార్టీ స్థానిక ఎన్నికల్లో పూర్తిస్థాయిలో విజయం సాధించింది. మళ్లీ ఇపుడు కాంగ్రెస్ పూర్వవైభం కోసం తీవ్రంగా ప్రయత్నిస్తోంది. ఇటీవల మొగిలిగిద్ద ప్రభుత్వ పాఠశాల 150 వార్షికోత్సవానికి విచ్చేసిన ముఖ్యమంత్రి సీఎం రేవంత్‌రెడ్డి రాజకీయ ప్రసంగం చేశారు. వచ్చే స్థానిక ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. స్థానిక ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నట్లు సీఎం నేరుగా చెప్పడం ప్రాధాన్యత సంతరించుకుంది.

మూడు జిల్లాల్లో ఓటర్ల వివరాలు

జిల్లా	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం ఓటర్లు
రంగారెడ్డి	3,99,404	3,95,216	33	7,94,653
మేడ్చల్	32,402	31,992	03	64,397
వికారాబాద్	3,32,038	3,39,885	17	6,72,940

నిధులు కేటాయించకపోవడం శోచనీయం

మేడ్చల్ టౌన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : మేడ్చల్ వరకు చేపట్టే మెట్రో రైలు విస్తరణకు కేంద్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవటం శోచనీయమని మేడ్చల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ శివశంకర్ ముదిరాజ్ అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, బడ్జెట్‌లో రాష్ట్రానికి కేంద్రం ప్రభుత్వం నిధులు కేటాయించకపోవటం విడ్డూరంగా ఉందన్నారు. కేవలం బీజేపీ పాలిత ప్రాంతాలకు, ఎన్నికల జరగనున్న రాష్ట్రాలకు నిధులు కేటాయించిందన్నారు. రాష్ట్రం నుంచి ఎనిమిది మంది ఎంపీలు ఉన్నా ఎలాంటి నిధులు తీసుకురాలేక పోయారన్నారు. రాష్ట్ర ప్రభుత్వ చేపడుతున్న అభివృద్ధి పనులకు అడ్డంకులు వేయటానికే కేంద్రం కుట్ర పూరితంగా వ్యవహరించిదని ఆరోపించారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న పాపిశెట్టి రాము

టీఎస్‌యూ క్యాలెండర్ ఆవిష్కరణ

ఆమనగల్లు , ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ స్టూడెంట్ యూనియన్(టీఎస్‌యూ) క్యాలెండర్‌ను సోమవారం మండల పరిషత్ ఆవరణలో ఆవిష్కరించారు. ప్రముఖ సంఘ సేవకుడు పాపిశెట్టి రాము, టీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు కట్ట వెంకటేశ్ కార్యక్రమానికి హాజరై క్యాలెండర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సోషలిస్టు విద్యార్థి సంఘం రాష్ట్ర కో-ఆర్డినేటర్ జంతుక శంకర్, నాయకులు నాగరాజు, సాయికుమార్, తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలుపై నిలదీస్తాం

▸▸ కేసులకు భయపడేది లేదు

▸▸ మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

పరిగి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కేసీఆర్ అంటే ఒక చరిత్ర అని, ఈ విషయం తెలంగాణలో అందరికీ తెలుసు అని పరిగి మాజీ ఎమ్మెల్యే కె.మహేశ్‌రెడ్డి అన్నారు. సోమవారం పరిగిలోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. కేసీఆర్ గురించి మాట్లాడే అర్హత సీఎం రేవంత్‌రెడ్డికి, పరిగి ఎమ్మెల్యేకు గానీ లేదన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రతిపక్షంగా కోరుతున్నామన్నారు. కానీ ఉద్దేశపూర్వకంగా విమర్శించడం లేదన్నారు. కులకచర్ల మండలం దాస్యానాయక్‌తండాలో అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ పార్టీ కార్యక్రమం కాదని, తండావాసులు ఏర్పాటు చేసిన కార్యక్రమం అని తెలిపారు. పిలిస్తేనే కేటీఆర్‌తో పాటు వెళ్లామని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని రాజకీయం చేయడం తగదని కాదన్నారు. అయితే ప్రభుత్వ హామీలపై, వైఫల్యాలపై ప్రశ్నిస్తూనే ఉంటామని తెలిపారు. అధికార అహంకారంతో కేసులు పెడతామంటే భయపడేది లేదని స్పష్టం చేశారు. ప్రజల పక్షాన పోరాడి జైలుకు వెళ్లడానికి కూడా సిద్ధమేనని స్పష్టం చేశారు. ప్రభుత్వం ఏడాది పాలనలోనే విఫలమైందన్నారు. వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే ఎజెండా అని తెలిపారు. సమావేశంలో పరిగి మాజీ ఎంపీపీ అరవింద్ రావు, ఏఎంసీ మాజీ చైర్మర్ సురేందర్, మునిసిపల్ మాజీ చైర్మన్ అశోక్, మండల పార్టీ అధ్యక్షుడు ఆర్.ఆంజనేయులు, రైతుబంధు మండల మాజీ కో-ఆర్డినేటర్ ఎం.రాజేందర్, నాయకులు బి.ప్రవీణ్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ ఫోరం కన్వీనర్ ఫిరంగి వెంకట్‌రాంరెడ్డి, మౌలానా, పి.హన్మంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పరిగి మాజీ ఎమ్మెల్యే కె.మహేశ్‌రెడ్డి



అవార్డు అందుకున్న శ్రీదేవితో పాటు గీతావాహిని సభ్యులు

అవార్డు ప్రదానం

వికారాబాద్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): రిఫ్లెక్షన్ చానెల్ సనాతన కాంక్లేవ్ 2025 అవార్డును వికారాబాద్‌కు చెందిన గీతా వాహిని సంస్థ అధ్యక్షురాలు శ్రీదేవి అందుకున్నారు. ఆదివారం రాత్రి హైదరాబాద్‌లోని కేశవ మెమొరియల్ స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో మ్యూజిక్ డైరెక్టర్ ఆర్పీ పట్నాయక్ అందించారు. క్షేత్రస్థాయిలో భగవద్గీతను ప్రజల్లోకి తీసుకు వెళ్లినందుకు గాను ఈ అవార్డు వరించింది. కార్య క్రమంలో ఉపాధ్యక్షురాలు లావణ్య, ప్రధాన కార్యదర్శి జయశ్రీ, కోశాధికారి వరలక్ష్మి, సభ్యులు మధురి, ఝాన్సీరాణి, కరుణ, సరళ, లక్ష్మి కార్యక్రమంలో పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో కార్పొరేట్లకు పెద్దపీట

కందుకూరు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్ కార్పొరేట్ సంస్థలకు పెద్దపీట వేసేలా ఉందని.. పేదలను ఇంకా పేదలుగా చేసేలా ఉందని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు దుబ్బాక రాంచందర్ అన్నారు. సోమవారం ఆ పార్టీ మండల శాఖ కార్యదర్శి బుట్టి బాల్‌రాజ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని హైద్రాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై కేంద్ర మంత్రి నిర్మలాసీతారామన్ దిష్టిబొమ్మను దహనం చేశారు.



కేంద్ర మంత్రి నిర్మలాసీతారామన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

అ'పూర్వ' సమ్మేళనం

కడ్తాల్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ముద్విన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1985-86 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు సోమవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఆమనగల్లు మండలం అయ్యసాగర్ క్షేత్రం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో బాల్య మిత్రులంతా పాల్గొని ఆనాటి మధుర స్మృతులను నెమరువేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు వీరారెడ్డి, తిరుమలేశ్, వేణు, కృష్ణవేణి, రామచంద్రయ్య, యాదయ్య, భాస్కర్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, వనజ, తేజ, తదితరులు పాల్గొన్నారు.



పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో నాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

మాదిగల ఐక్యతను చాటాలి

ఆమనగల్లు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): లక్ష డప్పులు, వేల గొంతులు కార్యక్రమాన్ని విజయవంతం చేసి మాదిగల ఐక్యతను చాటాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు కంబాలపల్లి రవి పిలుపునిచ్చారు. సుప్రీం కోర్టు తీర్పును అనుసరించి రాష్ట్రంలో వెంటనే ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆమనగల్లు మండలం కోనాపూర్ గ్రామంలో సోమవారం ఎమ్మార్పీఎస్ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈనెల 7న హైదరాబాద్‌లో నిర్వహించే 'లక్ష డప్పులు, వేల గొంతులు' కార్యక్రమం విజయవంతంపై చర్చించారు. కార్యక్రమానికి సంబంధించి రూపొందించిన కరపత్రాలు, పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు మహేందర్, నిరంజన్, జంగయ్య, భద్ర, శ్రీశైలం, వీరేశ్, రమేశ్, కుమార్, రాములు, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న కంబాలపల్లి రవి, నాయకులు

ఉత్సాహంగా.. ఉల్లాసంగా..

రాష్ట్ర స్థాయి వాలీబాల్ టోర్నీ షురూ

హాజరైన 35 టీంలు

మూడు రోజుల పాటు కొనసాగింపు

ఆమనగల్లు , ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు మండలం శెట్టిపల్లిలో రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలు సోమవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మాజీ సర్పంచ్ ఎగిరిశెట్టి గోదాదేవి సత్యం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 4వ ఓపెన్ టు ఆల్ వాలీబాల్ పోటీలకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి 30 టీంలు హాజరయ్యాయి. మూడు రోజుల పాటు టోర్నమెంట్ నిర్వహణకు నిర్వాహకులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. రాష్ట్ర కాలుష్య నియంత్ర మండలి సభ్యుడు బాలాజీ సింగ్, టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్, మాజీ సర్పంచ్ ఎగిరిశెట్టి గోదాదేవి సత్యంలతో కలిసి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి పోటీలను ప్రారంభించారు. ముందుగా వివేకా విద్యాభారతి పాఠశాల విద్యార్థుల ఎన్‌సీసీ ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. అలాగే మార్చ్‌పాస్ట్ నిర్వహించారు. విజేతలకు ప్రథమ బహుమతి రూ.20,116, ద్వితీయ బహుమతి రూ.10,116లు, తృతీయ బహుమతి రూ.5,116లతో పాటు షీల్డ్‌లను అందజేస్తామని గోదాదేవి సత్యంలు పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి దేశంలో మరే రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణలో అత్యుత్తమ క్రీడా పాలసీ అమలుకు శ్రీకారం చుట్టినట్లు ఎమ్మెల్యే కసిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో పీఈటీ మహమూద్, ప్రసాద్, మల్లేశ్, సురేశ్, ఆలయ చైర్మన్ సింగం శ్రీనివాస్, నాయకులు పోనుగోటి అర్జున్‌రావు, వెంకటయ్య, భాస్కర్‌రావు, దేవేందర్ రావు, జగన్మోహన్, యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి



వాలీబాల్ పోటీలో తలపడుతున్న జట్లు

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): పోచారం మున్సిపాలిటీ పరిధిలోని పోచారం, యంనంపేట్‌లో నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్న నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని పోచారం మున్సిపల్ మాజీ కౌన్సిలర్ బాలగోని వెంకటేష్ గౌడ్ సోమవారం మున్సిపాలిటీ ప్రజావాణిలో ఫిర్యాదు చేశాడు. పోచారంలోని సర్వేనెంబర్ 10/2పార్టులో అశోకాబిల్డర్స్ నిర్వాహకులు నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టారని ఫిర్యాదులో పేర్కొన్నారు. సర్వేనెంబర్ 44లో జీప్లస్‌టు అనుమతులు పొంది ఆరు అంతస్తుల భవనాలు నిర్మిస్తున్నట్లు వివరించారు. యంనంపేట్ పరిధిలోని సర్వేనెంబర్లు 92, 93, 94, 95, 123పార్టు, 124పార్టులలోని నిర్మాణ సంస్థ బొంతకుంట వాగును ఆక్రమించి నిర్మాణాలు చేస్తున్నారని తెలిపారు. విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని వెంకటేష్ గౌడ్ కోరారు.

కళాశాలలో అక్రమ నిర్మాణాలు

ఘట్‌కేసర్ రూరల్: ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, ఘనాపూర్‌లోని కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో అడ్డగోలుగా అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయని, వాటిపై తగిన చర్యలు తీసుకోవాలని సోమవారం అదే గ్రామానికి చెందిన వేముల మహేశ్వర్, బొక్కోనిగూడకు చెందిన బి.కృష్ణారెడ్డిలు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఎదులాబాద్ రెవెన్యూ పరిధి సర్వేనెంబర్లు 1140, 1141లలో ప్రభుత్వ అనుమతులు తీసుకోకుండా కళాశాల భవనాలు నిర్మిస్తున్నారని ఆరోపించారు. అక్రమ నిర్మాణాలు చేపడుతున్న కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి కళాశాల యాజమాన్యం చర్యలు తీసుకొని, అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలని ప్రజావాణిలో ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

బల్దియా నిధులు దుబారా?

- ఆధునికీకరణ పేరిట రూ.43లక్షల ఖర్చు!
- నిధులేవో తెలపకుండా శిలాఫలకాల ఆవిష్కరణ
- తాండూరు మున్సిపాలిటీ అధికారులు తీరు


ఇంటీరియర్ డిజైన్‌తో కమిషనర్ చాంబర్



నిధుల వివరాలు తెలపకుండా వేసిన శిలాఫలకం

తాండూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): శిలాఫలకాలు వేస్తున్నారంటే.. అందులో నిధులెన్ని? ఏ పథకం నిధులతో చేపట్టారు? ఏపనిని చేపట్టారనే సమగ్ర వివరాలు, ప్రొటోకాల్ అంశాలుంటాయి. అయితే తాండూరు బల్దియాలో సమగ్ర వివరాలు లేకుండానే రూ.43లక్షల పనులకు సంబంధించి రెండు పనుల శిలాఫలకాలు వేసి ఎమ్మెల్యేతో ప్రారంభించాశారు. ఏకంగా రూ.43లక్షలు దుబారా చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒకవైపు ప్రజలు కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతుంటే మున్సిపాలిటీ నిధులను ఆధునికీకరణ పేరిట లక్షల్లో ఖర్చు చేయడమేంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

ఆధునికీకరణ పనులకు లక్షలు

తాండూరు మున్సిపాలిటీలో రూ.20లక్షలతో కౌన్సిల్ హాల్, ఆల్ సెక్షన్‌లలో ఫర్నీచర్ ఏర్పాటు, మాజీ చైర్‌పర్సన్ (ప్రస్తుతం స్పెషల్ ఆఫీసర్), కమిషనర్ ఇంటీరియర్ డిజైన్ చేయడానికి రూ.23లక్షలను కేటాయించారు. రూ.20లక్షలతో కౌన్సిల్ హాల్‌లో సిట్టింగ్ టేబుల్స్, సోఫాలు, స్టేజీ డెకొరేట్ చేశారు. రూ.23లక్షలతో మాజీ చైర్ పర్సన్, కమిషనర్ చాంబర్లను వుడ్‌తో ఆధునికీకరణ పనులు చేపట్టారు. అంతవరకు బాగానే ఉన్నా ఈనెల 25వ తేదీన ఈరెండు పనులను ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. మొదటి అంతస్తులో రూ.23లక్షలకు వేసిన శిలాఫలకంపై ఏఫండ్స్ నుంచి నిధులు కేటాయించారో పేర్కొనలేదు. రెండో అంతస్తు సమావేశ మందిరంలో వేసిన రూ.20లక్షల శిలాఫలకంపై ఏనిధులు ఖర్చు చేస్తున్నారో పేర్కొనబడలేదు. ఇంజనీరింగ్ విభాగం అధికారులు అసంపూర్తి పనులతోనే ఈపనులను ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి చేతుల మీదుగా ఆదరాబాదరాగా ప్రారంభించినట్లు పలువురు అంటున్నారు.

కౌన్సిల్ తీర్మానం ఉందా?

బల్దియాలో చేపట్టిన రూ.43లక్షల పనులకు అసలు కౌన్సిల్ తీర్మానం ఉందా? అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఒకవేళ తీర్మానం చేస్తే ఏ కౌన్సిల్‌లో తీర్మానించారు, ఏ ఫండ్స్ కేటాయించారనే విషయాలను ఇంజనీరింగ్ అధికారుల నుంచి స్పష్టమైన వివరాలు తెలపకపోవడంతో పలు అనుమానాలకు తావిస్తోంది.

నామమాత్రంగా ఫర్నీచర్

నామ మాత్రంగా ఫర్నీచర్‌ను ఏర్పాటు చేసి రూ.23లక్షలను నొక్కేసే ప్రయత్నంలో అధికారులు ఉన్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మున్సిపాలిటీలో ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, సానిటేషన్, రెవెన్యూ, అకౌంట్, ఎస్టిబ్లిస్‌మెంట్, రికార్డు, మెప్మా, ఇన్ వార్డు, అవుట్ వార్డు, పింఛన్ విభాగాలున్నాయి. రూ.20లక్షల వ్యయంతో కౌన్సిల్ హాల్‌తో పాటు ఆల్‌సెక్షన్స్‌లలో ఫర్నీచర్ ఏర్పాటు చేస్తున్నట్లు శిలాఫలకంలో పేర్కొన్నారు. కేవలం ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ విభాగాల్లో మాత్రమే ఫర్నీచర్‌ను ఇంజనీరింగ్ విభాగం ఏర్పాటు చేయించింది. ముఖ్యమైన రెవెన్యూ, అకౌంట్స్, సానిటేషన్స్, షరాఫ్, రికార్డు, ఇన్‌వార్డు, అవుట్ వార్డు, ఎస్టాబ్లిష్‌మెంట్ విభాగాలలో ఒక కుర్చీ కూడా ఏర్పాటు చేయలేదని, తుప్పుపటిన బీరువాలు, విరిగిపోయిన కుర్చీలను వేసుకుంటామని, ఎలాంటి పనిలేని ఇంజనీరింగ్ విభాగానికి చెందిన వర్క్ ఇన్‌స్పెక్టర్లకు ఏసీలు, ప్రత్యేక క్యాబీన్లను ఏర్పాటు చేశారని ఉద్యోగాలు విమర్శిస్తున్నారు. సానిటరీ సిబ్బందికి వేతనాలు చెల్లించలేని పరిస్థితులు ఉన్నా చైర్మన్, కమిషనర్ చాంబర్‌లో సీఎం, కలెక్టర్ చాంబర్‌లను మెరుగ్గా తీర్చిదిద్దడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

తీర్మానాలున్నాయి



ఆధునికీకరణకు సంబంధించి కౌన్సిల్ తీర్మానాలు ఉన్నాయి. ఇంకా ఫర్నీచర్ ఇతర, మెటీరియల్ రావాల్సి ఉంది. శిలాఫలకలపై నిధుల వివరాలు పేర్కొనలేదన్న ఆరోపణలు వాస్తవం. పూర్తి స్థాయిలో ఫర్నీచర్‌ను ఏర్పాటు చేస్తాం. 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి ఆధునికీకరణకు వెచ్చించాం. నిధుల వ్యయానికి సంబంధించి ఇంకా ఎంబీ రికార్డు జరగలేదు.

- ఖాజాహుస్సేన్, మున్సిపల్ ఇంజనీర్, తాండూరు

క్రైం కార్నర్

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

యాలాల, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కోకట్ కాగ్నా వాగులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు యాలాల ఎస్ఐ గిరి తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కోకట్‌కాగ్నా వ్యక్తి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు అక్కడికి వెళ్లి మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడి ఒంటిపై నల్లటి ప్యాంటు, సుమారు 35నుంచి 40ఏళ్ల వయస్సుగల వ్యక్తి కాగ్నా నది నీటిలో పడి మృతిచెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని తాండూరులోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి శవ పరీక్ష నిమిత్తం తరలించినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ గిరి తెలిపారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ కలహాల కారణంగా ఓవ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఘట్‌కేసర్‌కు చెందిన డేరంగుల శేఖర్(32) మద్యానికి బానిసై తరచూ భార్యతో గొడవపడేవాడు. దీంతో భార్య ఇల్లు వదిలి వెళ్లిపోయింది. అప్పటి నుంచి భార్యాభర్తలు వేర్వేరుగా ఉంటున్నారు. దీంతో శేఖర్ ఈనెల మొదటి తేదీన మద్యం మత్తులో తన సోదరులతో గొడవపడి ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. దీంతో కుటుంబసభ్యులు వెతకగా ఆదివారం రాత్రి స్థానిక చిన్నచెరువు సమీపంలో చెట్టుకు ఉరేసుకుని వేలాడుతూ కనిపించాడు. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పరశురాం తెలిపారు.

సిమెంట్ లారీ బోల్తా

- వాహనాల రాకపోకలకు అంతరాయం


బుగ్గ సమీపంలో బోల్తాపడిన సిమెంట్ లారీ

వికారాబాద్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : బుగ్గ సమీపంలో సిమెంట్ లారీ అదుపు తప్పి బోల్తా పడడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. తాండూరు నుంచి సిమెంట్, బండ్లరాళ్ల లోడ్‌తో వచ్చే వాహనాలు అనంతగిరి ఘాట్ రోడ్డు ఎక్కేపరిస్థితి లేకపోవడంతో బుగ్గ రోడ్డు మార్గంలో వికారాబాద్ చేరుకుని ఇక్కడి నుంచి వెళుతాయి. సోమవారం రాత్రి సైతం ఓ సిమెంట్ లారీ అటుగా వస్తు అదుపు తప్పి బోల్తాపడింది. దీంతో ఆ దారి గుండా వచ్చే వాహనాలు నిలిచిపోయి కొంత ఇబ్బంది ఏర్పడింది.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల రికవరీ

ధారూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాలలో పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను గుర్తించి రికవరీ చేశారు. మండల పరిధిలోని వివిధ ప్రాంతాల్లో 10మంది సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న వారు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సీఈఐఆర్ సాంకేతిక పరిజ్ఞానంతో మొబైల్ ఫోన్‌లను పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న ఈ ఫోన్లను సీఐ రఘురాం, ఎస్ఐ వేణుగోపాల్ గౌడ్‌లు బాధితులకు అందజేశారు.

వైభవంగా వసంత పంచమి


వికారాబాద్: శిశు మందిరంలో నిర్వహించిన అక్షరాభ్యాసంలో చిన్నారులు, వారి తల్లిదండ్రులు


తాండూరు: సరస్వతి శిశుమందిరంలో..


శామీర్‌పేట: తూంకుంటలోని శ్రీవిజ్ఞాన భారతి పాఠశాలలో పూజలు

వికారాబాద్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సరస్వతీ శిశు మందిరంలో వసంత పంచమి అక్షరాభ్యాస కార్యక్రమం సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన వక్త వీరయ్య మాట్లాడుతూ.. సనాతన కాలం నుండి చదువులకు అధిదేవత శ్రీ సరస్వతీ మాత అని దేవ, దానువులు పూజించారని తెలిపారు. చిన్నారులకు అక్షరభాస్యం చేయిస్తే సకల శుభాలు కలుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో 70 మంది చిన్నారులు అక్షరాభ్యాసం చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానాచార్యులు నరసింహులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మోమిన్‌పేట్: మండలంలోని కొత్త కోలుకుందలోని అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం వసంత పంచమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రంలో సరస్వతీ దేవి చిత్రపటానికి పూలమాలలు వేసిన అనంతరం చిన్నారులతో అక్షరభాస్యం చేయించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మూడుచింతలపల్లి: మండల పరిధిలో ఉన్న ఎస్ఎస్ఆర్ పాఠశాలలో సోమవారం వసంత పంచమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్లు చంద్రమోహన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డిలు సరస్వతీదేవికి వేదబ్రహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య ప్రత్యేక పూజలు చేశారు.

దుద్యాల/బొంరాస్‌పేట్: బొంరాస్‌పేట్ మండల కేంద్రంలోని రెయిన్‌బో పాఠశాల, దుద్యాల మండల కేంద్రంలోని నేతాజీ విద్యానికేతన్ పాఠశాలతో పాటు మండలంలోని వివిధ పాఠశాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం వసంత పంచమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సరస్వతీ దేవి చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్నారులతో అక్షరభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ పి.రాఘవేందర్‌యాదవ్ మాట్లాడుతూ విద్యతోనే ప్రగతి సాధ్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రఘు, అన్వర్, పార్వతి, స్వరూప, కవిత, శ్వేత, పద్మ, జయశ్రీ పాల్గొన్నారు.

కొడంగల్: మండలంలోని అన్నారం, రుద్రారం, అంగడిరైచూర్ తదితర గ్రామాల్లోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో వసంత పంచమి సందర్భంగా సోమవారం సరస్వతీ దేవి చిత్రపటానికి పూలమాలలు వేసిన అనంతరం చిన్నారులతో అక్షరభ్యాసం చేయించారు. అన్నారంలో మాజీ సర్పంచ్ అనితాపకీరప్ప, టీచర్‌లు అరుణ, సంతోష చిన్నారులతో అక్షరాలు దిద్దించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఆశప్ప పాల్గొన్నారు. అదేవిధంగా నవీన ఆదర్శ ఉన్నత పాఠశాలలో సోమవారం వసంత పంచమి వేడుకలు నిర్వహించారు. సరస్వతి దేవి చిత్రపటానికి పూలమాలలు వేసి అనంతరం చిన్నారులతో అక్షరభ్యాసం చేయించారు. ప్రిన్సిపాల్ డివి.నరేశ్‌రాజ్, పాఠశాల వ్యవస్థాపకుడు వెంకటయ్య, ప్రిన్సిపాల్ డీవీ.నరేశ్‌రాజ్, సంతోష పాల్గొన్నారు.

శామీర్‌పేట: మండలంలోని తూంకుంట పరిధిలోని శ్రీవిజ్ఞాన భారతి పాఠశాలలో కరస్పాండెంట్ హనుమంతరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం వసంత పంచమి పూజలను ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు సరస్వతీదేవికి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. చిన్నారులకు అక్షరభ్యాసం చేయించారు. అదేవిధంగా శ్రీవిజ్ఞానభారతి పాఠశాల క్యాంపస్‌లో వసంత పంచమి సందర్భంగా మేడ్చల్ జిల్లా గ్రంథాలయం సంస్థ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని పెద్దఎత్తున నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తూంకుంట మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, రామాలయ ధర్మకర్త జగదీశ్‌గౌడ్, విజ్ఞాన భారతి పాఠశాల ప్రిన్సిపాల్ జంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాండూరు: వసంతపంచమిని పురస్కరించుకుని సోమవారం పట్టణంలోని సరస్వతి శిశుమందిర్‌లో అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయిమేధ విద్యాలయంలో బాసరసరస్వతి ఆలయం నుంచి తీసుకువచ్చిన కుంకుమతో సరస్వతీ మాత పూజ నిర్వహించడంతో పాటు కరస్పాండెంట్ వెంకటరెడ్డి ఆధ్వర్యంలో చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన్నారుల ఆటపాటలు, సరస్వతీ మాత అలంకరణలో వేషధారణ అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సజిత, వైస్‌ప్రిన్సిపాల్ నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పరిగి: వసంత పంచమి సందర్భంగా సోమవారం ఇండస్ వ్యాలీస్కూల్, శ్రీసరస్వతీ శిశుమందిర్ పాఠశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. తల్లిదండ్రుల సమక్షంలో చిన్నారులకు ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, రచయిత డాక్టర్ భాస్కర్ అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ వీరేశం, ప్రిన్సిపాల్ సునీల్‌కుమార్, శిశుమందిర్ ప్రధానాచార్యులు మల్లేశ్, నాయకులు ఆంజనేయులు పాల్గొన్నారు.


పరిగి: ఐవీఎస్‌ఈ స్కూల్‌లో అక్షరాభ్యాసం చేయిస్తున్న డాక్టర్ భాస్కర్

ఎమ్మార్పీఎస్ మహాప్రదర్శనను జయప్రదం చేయాలి

మర్పల్లి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ రిజర్వేషన్లు అమలు చేయాలని ఈనెల 7వ తేదీన హైదరాబాద్‌లో ఎమ్మార్పీఎస్ తలపెట్టిన 'లక్ష డప్పులు, వేయి గొంతుకలు' మహా ప్రదర్శనను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట సోమవారం కరపత్రాలను విడుదల చేశారు. మండల కేంద్రంలోని యంసీఎం ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం(నేడు) కార్యవర్గ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పరిగి: ఎమ్మార్పీఎస్ మహాప్రదర్శనను విజయవంతం చేయాలని ఎమ్మారీప్పస్ నాయకులు బందెయ్య కోరారు. కార్యక్రమానికి సంబంధించి సోమవారం పరిగిలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు.

దౌల్తాబాద్: లక్ష డప్పులు, వేయి గొంతులు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని అంబేడ్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు శ్యామ్‌సుందర్, నియోజకవర్గ అధ్యక్షుడు యు.రమేశ్‌బాబు అన్నారు. మండల కేంద్రంలో కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు దస్తప్ప, శ్రీనివాస్, అంజి, సాయిలు పాల్గొన్నారు.

సీపీఎస్‌యూ జిల్లా నూతన కార్యవర్గం

మోమిన్‌పేట్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ కాంట్రిబ్యూటరి స్కీమ్ ఎంప్లాయీస్ యూనియన్ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడిగా లింగమొళ్ల దర్శన్‌గౌడ్ ఆధ్వర్యంలో నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. యూనియన్ ఆవిర్భావం, పాత పెన్షన్ విధానం అమలు కోసం చర్చించారు. ఉపాధ్యాయ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయనున్నట్లు తెలిపారు. జిల్లా కార్యవర్గ అధ్యక్షుడిగా రాజ్‌కుమార్, అధ్యక్షుడిగా క్రాంతికుమార్, ప్రధాన కార్యదర్శిగా నర్సింహారాజు, ఉపాధ్యక్షుడిగా సుందర్, అసోసియేట్ అధ్యక్షుడిగా రవీందర్, సంయుక్త కార్యదర్శిగా శ్రీనివాస్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా అనిల్, తిరుపతి, రాజరత్నంతో పాటు సభ్యులను ఎన్నుకున్నారు.

రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

పరిగి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ బీకేఎస్ ఆధ్వర్యంలో సోమవారం పరిగి తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. బీకేఎస్ మండల అధ్యక్షుడు వెంకటొరెడ్డి మాట్లాడుతూ.. రూ.2లక్షల వరకు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రైతు భరోసా కింద ఎకరాకు రూ.15వేలు వేయాలని కోరారు. కందుల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. కార్యక్రమంలో దోమ పీఏసీఎస్ మాజీ చైర్మన్ సత్యనారాయణరెడ్డి, పి.వెంకట్‌రాంరెడ్డి, ఉప్పరి రవిసాగర్, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

పేదలకు అండగా సీఎంఆర్ఎఫ్


ఎల్‌వోసీని అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ధారూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): సీఎం సహాయనిధి పేదలకు అండగా నిలుస్తుందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. మండల పరిధిలోని మైలారం గ్రామానికిచెందిన వంశీరాజుల లక్ష్మి వెన్నుపూస సంబంధిత వ్యాధితో హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స పొందుతోంది. ఆమె వైద్య ఖర్చుల నిమిత్తం స్పీకర్ జి.ప్రసాద్‌కుమార్ రూ.2.50 లక్షల ఎల్‌వోసీని ఇప్పించారు. కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు మాన్‌సింగ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ అశోక్ ముదిరాజ్, నాయకులు సోమవారం ఎల్‌వోసీని ధారూరులో లక్ష్మి కుటుంబసభ్యులకు అందజేశారు.

చౌడాపూర్: మండలంలోని మరికల్ గ్రామంలో సోమవారం పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఆదేశానుసారం గ్రామానికి చెందిన పోచమ్మకు రూ.44వేలు సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నర్సింహారెడ్డి, రామ్మోహన్‌శర్మ, దామోదర్‌రెడ్డి, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధే లక్ష్యం


బార్వాద్‌లో సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న నాయకులు

కోట్‌పల్లి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): గ్రామాబివృద్ధే లక్ష్యమని మాజీ ఎంపీటీసీ నర్సింహారెడ్డి అన్నారు. మండలంలోని బార్వాద్‌లో సోమవారం ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద రూ.30లక్షల నిధులతో నాయకులతో కలిసి సీసీరోడ్డు పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు నర్సింహులు, నాయకులు రాంచందర్‌రెడ్డి (టిల్లు), నాయకులు రాచిరెడ్డి, రవీందర్‌రెడ్డి, సంజీవయ్యగౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, రవి, వెంకట్‌రెడ్డి, రాములు పాల్గొన్నారు.

మూడుచింతలపల్లి: గ్రామాలబివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఏఎంసీ చైర్మన్ నర్సింహులుయాదవ్ అన్నారు. మండలంలోని ఉద్దెమర్రిలో సోమవారం రూ.10లక్షల నిధులతో సీసీరోడ్లు, శ్మశానవాటికకు ఏఎంసీ చైర్మన్ నర్సింహులుయాదవ్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్‌ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు విష్ణుగౌడ్, వేణుగోపాల్, నర్సింహులు, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులకు సర్పంచుల తిప్పలు

నవాబుపేట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలానికి అసిస్టెంట్ ఇంజనీర్ ఆఫ్ పంచాయతీ రాజ్ లేకపోవడంతో మోమిన్‌పేట్ పంచాయతీరాజ్ అసిస్టెంట్ ఇంజనీర్ ప్రణీత్‌ను ఇన్‌చార్జిగా నియమితులైన విషయం తెలిసిందే. అయితే మండలంలోని 32 గ్రామపంచాయతీల్లో పెండింగ్ బిల్లులను ప్రణీత్ ఎంబీ రికార్డు చేయకుండా తాను ఎక్కడ ఉంటే అక్కడికి వచ్చి ఎంబీ, తీర్మానం తీసుకోవాలని చెబుతున్నారని అక్నాపూర్ తాజా మాజీ సర్పంచ్ తలారి అజయ్‌కుమార్ ఆరోపించారు. మండలానికి ఆయన ఎప్పుడు వస్తారని అడిగితే సమాధానం ఇవ్వడం లేదని, ఎంపీడీవో అనురాధ కూడా సరైన సమాధానం ఇవ్వడం లేదని ఆరోపించారు. సర్పంచ్‌గా ఉన్నప్పుడు అప్పులు చేసి అభివృద్ధికి నిధులు ఖర్చు చేసినా బిల్లులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేయడం సరైంది కాదన్నారు. మాజీ సర్పంచులు బిల్లుల కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా సదరు అధికారి ఏ ఒక్క రోజు కూడా అందుబాటులో ఉండటం లేదని ఆరోపించారు.

ఎంపీటీసీ స్థానాల్లో మార్పులు

దుద్యాల, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): దుద్యాల మండలంలో 8 ఎంపీటీసీ స్థానాల్లో మార్పులు చేర్పులు చేసి అధికారులు సోమవారం తుది ముసాయిదా జాబితాను విడుదల చేశారు. మొదట ఏడు స్థానాలకు ముసాయిదా విడుదల చేయగా అభ్యంతరాలను స్వీకరించి పలు గ్రామాలను, ఎంపీటీసీ స్థానాలను పునరుద్దరించినట్లు అధికారులు తెలిపారు. చిలుముల్‌మైలారం, కుదురుమళ్ల, దుద్యాల-1, దుద్యాల-2, హకీంపేట్, గౌరారం, లగచర్ల, పోలెపల్లి ఎంపీటీసీ స్థానాలను ఏర్పాటు చేశారు. చిలుముల్‌మైలారం పరిధిలో చిలుముల్‌మైలారం, చెట్టుపల్లి తండా, నాజ్‌ఖాన్‌పల్లి, ఎక్కచెరువు తండా, సత్తర్‌కుంట తండా, కుదురుమళ్ల పరిధిలో కుదురుమళ్ల, సంగాయిపల్లి, దుద్యాల-1 పరిధిలో దుద్యాల-1 నుంచి 8 వార్డులతో పాటు సోమ్లానాయక్ తండా, దుద్యాల-2 పరిధిలో 9 నుంచి 12 వార్డులతో పాటు ఆలేడ్, హకీంపేట్ పరిధిలో హకీంపేట్, అల్లిఖాన్‌పల్లి, పోలెపల్లి పరిధిలో పోలెపల్లి మాత్రమే ఉండగా గౌరారం పరిధిలో గౌరారం, ఈర్లపల్లి, సాగారం తండా, హంసన్‌పల్లి, లగచర్ల పరిధిలో లగచర్ల, రోటిబండ తండా, సంద్రకుంట తండాలు ఉన్నాయి.

ఎంపీటీసీ స్థానాలను సవరించాలి

దుద్యాల: మండలంలో ఎంపీటీసీ స్థానాలను సవరించాలని కోరుతూ దుద్యాల మండల ఎంపీడీవో కార్యాలయంలో సూపరింటెండెంట్ శ్రీనివాస్‌కు బీఆర్ఎస్ నాయకులు సోమవారం వినతిపత్రం అందజేశారు. మండలంలో ఏడు ఎంపీటీసీ స్థానాలకు బదులు ఎనిమిది ఏర్పాటు చేయాలని కోరారు. అదే విధంగా ప్రజల అభిప్రాయాలు తీసుకొని సంబంధిత ఎంపీటీసీ పరిధిలో దూరంగా ఉన్న పంచాయతీలను తొలగిస్తూ దగ్గర ఉన్న గ్రామ పంచాయతీలను విలీనం చేస్తూ ఎంపీటీసీ స్థానాలను ఏర్పాటు చేయాలన్నారు. పోలెపల్లి, దుద్యాల-1, హకీంపేట్, లగచర్ల ఎంపీటీసీ పరిధిలో రోటిబండ తండా, ఈర్లపల్లి, సంద్రకుంట తండా, గౌరారం ఎంపీటీసీ పరిధిలో సాగారం తండా, హంసన్‌పల్లి, ఎక్కచెరువు తండా, కుదురుమళ్ల ఎంపీటీసీ పరిధిలో సంగాయిపల్లి, ఆలేడ్, చిలుముల్‌మైలారం ఎంపీటీసీ పరిధిలో నాజ్‌ఖాన్‌పల్లి, సత్తర్‌కుంట తండా, చెట్టుపల్లి తండా, దుద్యాల-2 పరిధిలో అల్లిఖాన్‌పల్లి గ్రామాలను విలీనం చేస్తూ ఎంపీటీసీ స్థానాలను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో దుద్యాల మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు చాంద్‌పాషా, సీనియర్ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, మడిగే శ్రీనివాస్, నరేశ్‌గౌడ్, బసిరెడ్డి, కవిత పాల్గొన్నారు.

బొంరాస్‌పేట్: మండలంలో ఎంపీటీసీల తుది ముసాయిదా జాబితాను విడుదల చేసినట్లు ఎంపీడీవో వెంకన్నగౌడ్ తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం తుది ముసాయిదా జాబితాను ప్రదర్శించారు. అభ్యంతరాల పరిశీలన అనంతరం తుది జాబితాను విడుదల చేసినట్లు తెలిపారు.

సంక్షిప్తంగా..

నేటి నుంచి త్రిపురాంబిక ఆలయ వార్షికోత్సవం

మేడ్చల్ టౌన్: మేడ్చల్ మున్సిపాలిటీ అత్వెల్లిలోని శ్రీ త్రిపురాంబికా సమేత చంద్రమౌళీశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉదయం 6గంటల నుంచి అంకురార్పణం, అగ్నిప్రతిష్ఠాపన, రుద్రాభిషేక పూజలతో వేడుకలు ప్రారంభమవుతాయని నిర్వాహకులు పేర్కొన్నారు. భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

నేడు వేంకటేశ్వరస్వామి ఆలయంలో రథసప్తమి

కొడంగల్: పట్టణంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం జరిగే రథసప్తమికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ధర్మకర్తలు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వేకువ జామున నుంచి రాత్రి వరకు సూర్యప్రభ, చిన్న శేష, గరుడ, హనుమంత, కల్పవృక్ష, సర్వభూపాల, చంద్రప్రభ వాహనాలపై శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీనివాసుడు మాఢవీధుల్లో భక్తులకు దర్శనం ఇవ్వనున్నట్లు తెలిపారు.

టెండర్లకు ఆహ్వానం

వికారాబాద్: జిల్లాలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలు, హాస్టల్స్, ప్రభుత్వ భవనాలకు రంగులు వేయడానికి వాల్ పెయింట్స్ సప్లయ్ కోసం టెండర్లకు ఆహ్వానించనున్నట్లు కలెక్టర్ ప్రతీక్‌జైన్ తెలిపారు. వీటి కోసం 15వేల లీటర్ల వాల్‌పెయింట్స్ అవసరమవుతుందని ఆసక్తిగలవారు టెండర్లను ఏవో అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ కలెక్టరేట్ ఐడీఓసీ వికారాబాద్ కార్యాలయంలో ఈ నెల 5 సాయంత్రం 5వ తేదీ లోపు అందించాలని సూచించారు.

కాంగ్రెస్ మండల అధ్యక్షుడికి పరామర్శ

మోమిన్‌పేట్: మండలంలోని సదాశివపేట్‌లో ఇటీవలే రోడ్డు ప్రమాదంలో గాయపడిన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మన్నె శంకర్‌యాదవ్ హైదరాబాద్‌లోని కామినేని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ సోమవారం ఆస్పత్రికి చేరుకొని మన్నె శంకర్‌యాదవ్ ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.

విద్యార్థులకు స్కూల్ బ్యాగుల పంపిణీ

బషీరాబాద్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): వసంత పంచమిని పురస్కరించుకొని నవాంద్గీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వ చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి పీఆర్వో, స్థానికుడు యాస మల్లారెడ్డి సోమవారం స్కూల్‌బ్యాగులు, సీటింగ్ మ్యాట్లు, షూలు పంపిణీ చేశారు. అంతకు ముందు పాఠశాల ప్రధానోపాధ్యాయులు మధుసూదన్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వీరామణి, మధుసూదన్‌రెడ్డి, సీనియర్ జర్నలిస్ట్ యాస వెంకట్‌రాంరెడ్డి, యాస చెన్నరెడ్డి, యాస జనార్దన్‌రెడ్డి, స్థానిక నాయకులు గాండ్ల వీరన్న, గాల్‌రెడ్డి, మైపాల్‌రెడ్డి, కరుణం వేణు, ఉప సర్పంచ్ గోపాల్, యూత్ నాయకులు సురేష్, రవి, లక్ష్మణ్, భార్గవ్‌రెడ్డి, భీమ్‌రెడ్డి, మొగులప్ప పాల్గొన్నారు.